సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 23 । జనవరి । 2024



జహీరాబాద్ పట్టణంలో శోభాయాత్ర



యువతి భక్తి పారవశ్యం

జయహో.. జగదభిరామా..

అయోధ్య రామాలయంలో నిర్వహించిన బాలరామ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా దేవాలయాలు రామనామస్మరణతో మార్మోగాయి. హనుమాన్, రామాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీరామ చంద్రమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజన సంకీర్తనలతో ర్యాలీలు తీశారు. బాలరాముడి ప్రతిమలతో జైశ్రీరాం నినాదాలతో ఊరేగింపు నిర్వహించారు. అయోధ్య ఘట్టాన్ని లైవ్‌లో వీక్షించడానికి పలుచోట్ల బిగ్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సంగారెడ్డిలోని శివాలయంలో శంఖం ఊదుతున్న బాలిక



పటాన్‌చెరు కోదండరామ ఆలయంలో స్వామివారి కల్యాణం



జోగిపేటలో కోలాటం ఆడుతున్న మహిళలు



సంగారెడ్డి రామ మందిరంలో అన్నదానం

న్యూస్‌రీల్

డ్రంకెన్ డ్రైవ్‌లో 9 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానాతో పాటు జైలుశిక్ష విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 9మంది వాహనదారులను సోమవారం కోర్టులో హాజరుపర్చారు. జడ్జి ఆరుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా, మరో ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.10వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.


10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం, వాహనాలు

జహీరాబాద్ టౌన్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ పట్టణంలోని మైలూర్‌కు చెందిన వ్యాపారి జమదార్ గుండప్ప (42).. జహీరాబాద్‌లోని డ్రైవర్ కాలనీకి చెందిన వ్యాపారి హర్షద్ వద్ద రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. వాటిని డీసీఎం, రెండు బొలేరో వాహనాల్లో తరలించేందుకు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న ప్రత్యేక టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి మూడు వాహనాల్లో ఉన్న 10 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు, బియ్యంను పట్టణంలోని పోలీసు స్టేషన్‌కు తరలించారు. హర్షద్‌తో పాటు డ్రైవర్లు నారాయణ, పరమేష్, బాణోత్ రాజులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

పల్లె ప్రగతికి ప్రణాళిక



- సర్పంచుల ఇష్టారాజ్యానికి చెక్!
- ప్రణాళికాబద్ధంగా పంచాయతీ నిధుల ఖర్చు
- ఈ– గ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో నమోదు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సర్పంచులు కొందరు తమకున్న అధికారాలను వినియోగించుకుని గ్రామ పంచాయతీ నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేస్తుంటారు. నిబంధనలకు విరుద్ధంగా తీర్మానాలు చేసి పంచాయతీకి వచ్చిన నిధులను డ్రా చేస్తుంటారు. ఈ అవకతవకలకు చెక్ పెట్టి, ప్రణాళికాబద్ధంగా పంచాయతీ నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను తయారు చేస్తున్నారు. ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే వివిధ రకాల నిధులను ఇష్టానుసారంగా డ్రా చేసుకునేందుకు వీలుండదు. ప్రస్తుతం రూపొందిస్తున్న ప్రణాళికలో పేర్కొన్న పనులకే ఈ నిధులను వెచ్చించాల్సి ఉంటుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు వస్తుంటాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఆయా గ్రామ పంచాయతీ జనాభా ప్రాతిపదికన ఈ నిధులు వస్తాయి. చిన్న గ్రామ పంచాయతీకైనా ఏటా కనీసం రూ.మూడు లక్షల నుంచి రూ.నాలుగు లక్షలు వస్తుంటాయి. పెద్ద పంచాయతీలకు రూ.40 లక్షల వరకు వస్తుంటాయి. అలాగే ఎస్‌ఎఫ్‌సీ కింద కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంది. ఇవి కాకుండా, పంచాయతీకి వివిధ పన్నుల రూపంలో ఆదాయం లభిస్తుంది. ఈ నిధులు పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగించాలి. వీటిని కొందరు సర్పంచులు ఇష్టానుసారంగా ఖర్చు చేస్తుంటారు. రాజకీయ పలుకుబడి ఉపయోగించి తమకు అనుకూలంగా తీర్మానాలు చేసి డబ్బులు డ్రా చేస్తుంటారు. జిల్లాలో ఏటా పదుల సంఖ్యలో సర్పంచుల అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతుంటాయి. కొందరు సర్పంచుల చెక్‌పవర్‌లను కూడా రద్దు చేస్తుండటం పరిపాటిగా మారుతుంది. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు గ్రామ అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2024– 25 కోసం తయారు చేస్తున్న ప్రణాళికలో పేర్కొన్న అంశాలకే నిధులను వినియోగించాల్సి ఉంటుంది.

> **ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి**
>
> గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వీటిని పకడ్బందీగా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కార్యదర్శులకు ఈ అంశంపై శిక్షణ ఇచ్చాం. నిర్ణీత గడువులోగా ప్రణాళికలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చూస్తాం. ఈ అంశంపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం.
>
> – సురేష్‌మోహన్, జిల్లా పంచాయతీ అధికారి

ఆన్‌లైన్‌లో నమోదు

జిల్లాలో మొత్తం 647 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రణాళిక రూపకల్పన కోసం ఆయా పంచాయతీల కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, ఇలా వివిధ రకాల పనులకు ఏ మేరకు నిధులు అవసరం ఉంటుంది. అలాగే అన్‌టైడ్ నిధులతో చేపట్టాల్సిన పనులు ఏవీ..? ఇలా అన్ని వివరాలను గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో పొందుపరుస్తున్నారు.

అలాగే స్త్రీశిశు సంక్షేమం, ఆసరా, ఉపాధి హామీ వంటి రంగాల్లో చేపట్టనున్న కార్యకలాపాలను కూడా ఈ ప్రణాళికలో పేర్కొంటారు. వీటిని గ్రామ సభల్లో చర్చిస్తారు. అనంతరం ఈ–గ్రామ్‌స్వరాజ్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రణాళికలను నమోదు చేస్తారు. దీంతో రానున్న రోజుల్లో ప్రణాళికలో పేర్కొన్న అంశాలపైనే పాలకవర్గాలు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇష్టానుసారంగా తీర్మానాలు చేసి ఈ ప్రణాళికకు విరుద్ధంగా నిధులు డ్రా చేయడం ఇకపై కుదరదు.

ప్రజావాణికి 34 దరఖాస్తులు

కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు ప్రజావాణికి వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. మొత్తం 34 దరఖాస్తులు రాగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 15, ఇతర శాఖలవి 19 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలో వచ్చిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల గురించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. పటాన్ చెరు మార్కెట్ యార్డులో వ్యాపారం చేసుకునేందుకు లైసెన్స్ పొందిన అబ్దుల్ సిత్వత్ కు స్థలం కేటాయించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే సంగారెడ్డి మండలం చింతల్ పల్లి గ్రామ పరిధిలోని కేశవ నాగేశ్వర స్వామి ఆలయ భూమి ఆక్రమణకు గురవుతుందని, దానిని కాపాడాలని కమిటీ సభ్యులు వినతి అందజేశారు.

చైతన్య రథం ప్రారంభం

ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటరు చైతన్య రథాన్ని కలెక్టర్ క్రాంతి సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రచార రథం అన్ని నియోజకవర్గాలలో ఓటర్లకు అవగాహన కల్పిస్తూ తిరుగుతుందన్నారు. 22న సంగారెడ్డి నియోజకవర్గం నుంచి అందోల్ కు వెళ్తుందని, సాయంత్రం అక్కడి నుంచి నారాయణఖేడ్‌కి, 23న మధ్యాహ్నం జహీరాబాద్, 24న ఉదయం పటాన్‌చెరు, 25న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటుందని తెలిపారు. రథంతో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కళాకారులు కళాజాత కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ, అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సంగారెడ్డి టౌన్ : ఆడపిల్లల బంగారు భవితకు పునాది వేసి, వారు హక్కులు స్వేచ్ఛగా వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. ఈ నెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికల సంరక్షణకు సంబంధించిన పోస్టర్లు ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆడపిల్లలు చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చెప్పారు. వారికి రక్షణ కల్పించాలని పిలుపునిచ్చారు. డీడబ్ల్యుఓ సంధ్యారాణి, డీపీఓ సురేష్ మోహన్, డీఈఓ వెంకటేశ్వర్లు, డీసీపీఓ రత్నం, పల్లవి పాల్గొన్నారు.



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్ క్రాంతి

మల్లన్న దరి.. భక్త ఝరి

- **పసుపుమయమైన కొమురవెల్లి**
- ఘనంగా పెద్దపట్నం, అగ్నిగుండం
- శివసత్తులు, భక్తులతో కిక్కిరిసిన ఆలయం





కొమురవెల్లి ఆలయం తోటబావి వద్ద బండారు చల్లుకున్న భక్తులు, స్వామివారి విగ్రహంతో అగ్నిగుండం తొక్కుతున్న అర్చకుడు



మల్లన్నకు మొక్కుతున్న భక్తురాలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న క్షేత్రం బండారు మయమైంది. భక్తులు పసుపు చల్లుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామంతో మారుమోగాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయతోట బావి ప్రాంగణంలో సోమవారం వైభవంగా పెద్దపట్నం, అగ్నిగుండం వేశారు. పట్నం వారాన్ని పురస్కరించుకొని నగరానికి చెందిన యాదవులు అగ్నిగుండాలు, పెద్దపట్నం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్ కు చెందిన మానుక పోచయ్య యాదవ్ కుటుంబ సభ్యులు, దుర్గాప్రసాద్‌యాదవ్, యాదవ సంఘం సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తులు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. యాదవసంఘం ఒగ్గుపూజారులు పంచవర్ణాలతో 21 వరుసలతో పెద్దపట్నం వేశారు. అదే సమయంలో భగభగ మండే నిప్పుకణికలతో అగ్నిగుండం తయారు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్‌తోపాటు అర్చకులు ఉత్సవ విగ్రహాలను తీసుకొని అగ్నిగుండాలు, పెద్దపట్నం దాటారు. అనంతరం భక్తులు అగ్నిగుండాలను దాటూతూ స్వామిని దర్శించుకున్నారు. ఆనవాయితీ ప్రకారం నగర యాదవులకు శివసత్తులకు కొత్త వస్త్రాలతో ఆలయ ఈఓ, చైర్మన్, ధర్మకర్తలు సన్మానించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుస్నాబాద్ ఏసీపీ సతీష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా.. తోటబావి ప్రాంగణానికి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగాలు పలువురికి గాయాలయ్యాయి.

25న హుండీ లెక్కింపు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల 25న హుండీ లెక్కిస్తున్నట్లు ఆలయ ఈవో బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి వారం సందర్భంగా భక్తులు భారీగా తరలిరావడం.. కానుకలు సమర్పించడంతో ఆలయంలోని హుండీలు నిండిపోయాయన్నారు. లెక్కింపుల్లో బ్యాంకు అధికారులు, ఆలయ ఉద్యోగులు, ధర్మకర్తలు పాల్గొననున్నట్లు తెలిపారు.

శ్రీరాముడి పల్లకీపై బూటు

- భగ్గుమన్న రామభక్తులు
- ఓ ఇంటిపై దాడి.. పండ్ల దుకాణం దగ్ధం
- హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఉద్రిక్తత



శ్రీరాముడి పల్లకిపై విసిరిన బూటు



దౌల్తాబాద్‌లో రామ భక్తుల నిరసన

హత్నూర (సంగారెడ్డి): అయోధ్యలో భవ్య రామ మందిరం నిర్మాణం సందర్భంగా శ్రీరాముని పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బూటు విసిరిన ఘటన ఉద్రిక్తతకు దారి తీసింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పట్టణంలో శ్రీరాముని పల్లకీ సేవ నిర్వహిస్తుండగా ఓ ఇంటిపై నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బూటు విసిరారు. దీంతో రామభక్తులు కోపోద్రిక్తులయ్యారు. బూటు పడిన ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రామ భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రాజీవ్ గాంధీ చౌరస్తాలోని పండ్ల దుకాణాన్ని దగ్ధం చేశారు. జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ దౌల్తాబాద్ పట్టణమంతా అర్ధరాత్రి వరకు ర్యాలీలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్పీ రూపేష్ కుమార్, పటాన్‌చెరు డీఎస్పీ, జిన్నారం, సంగారెడ్డి పటాన్‌చెరు సీఐలు, ఎస్సైలు పోలీసు బలగాలతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. రామ భక్తులను సముదాయించే ప్రయత్నం చేశారు. వారి మాట వినకుండా ఆందోళనకారులు రోడ్డుపై బైఠాయించి.. చెప్పు విసిరిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా బూటు విసిరిన ఇంటిపైన రాళ్లతో దాడికి దిగారు. నిందితుడిని గుర్తించి అరెస్టు చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అయినా నిరసనకారులు వెనక్కు తగ్గకుండా అర్ధరాత్రి వరకు ఆందోళనను కొనసాగించారు. 108 అంబులెన్స్ రప్పించి భారీ పోలీస్ బందోబస్తు మధ్యలో బూటు విసిరిన కుటుంబ సభ్యులను భారీ బందోబస్తు మధ్య తరలించేందుకు ప్రయత్నం చేశారు. తహసీల్దార్ సంధ్య, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించారు.

ఎంతటి వారైనా శిక్షిస్తాం : ఎస్పీ

పల్లకీ సేవపై బూటు విసిరిన వారు ఎంతటి వారైనా శిక్షిస్తామని ఎస్పీ రూపేష్ తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కేసులు నమోదు చేస్తామని రామ భక్తులకు హామీ ఇచ్చారు. దౌల్తాబాద్‌లో పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

కరాటే పోటీల్లో ప్రతిభ


బహుమతి అందుకుంటున్న సాత్విక్

జహీరాబాద్ టౌన్: కరాటే ఖిలాడీ సీజన్ 2024 పోటీల్లో పట్టణంలోని పస్తాపూర్‌కు చెందిన విద్యార్థి ప్రతిభ కనబర్చి విజయం సాధించాడు. పస్తాపూర్‌కు చెందిన సురేశ్ కుమారుడు కృపా సాత్విక్ పట్టణంలోని ఆర్ఎల్ఆర్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. హైదబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన కరాటే ఖిలాడీ పోటీల్లో కృపా సాత్విక్ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచాడు. నిర్వాహకులు సర్టిఫికెట్‌తోపాటు మెడల్ అందజేశారు. సాత్విక్ కరాటే మాస్టర్లు కరుణ్ సతీష్‌కుమార్, పాఠశాల హెచ్ఎం కవిత, అభినందించారు.

జాతీయ స్థాయి టెన్నీకాయిట్‌కు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేటజోన్: జాతీయ స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు సిద్దిపేట జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఈనెల 21న కాచిగూడ మున్సిపల్ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. టెన్నీకాయిట్ అండర్16 బాలికల విభాగంలో సిద్దిపేట జిల్లాకు చెందిన సృజన(వర్గల్), సంజన (ఏన్సాన్‌పల్లి), బాలుర విభాగంలో ఆకాశ్ (సిద్దిపేట) ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ పోటీలు ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు రాజస్థాన్‌లో జరగనున్నాయి. ఈ సందర్భంగా జిల్లా యువజన శాఖ అధికారి నాగేందర్, టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రాజ్ కుమార్ , ఎస్జీఎఫ్ కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి వారిని అభినందించారు.

ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

జోగిపేట(అందోల్): హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఖేల్ ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో అందోలు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీలు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధాబాయి తెలిపారు. శని, ఆదివారాల్లో జరిగిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. విద్యార్థినీలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షకుడు పోచయ్యను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాధాబాయి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా సహకరించిన 17వ వార్డు కౌన్సిలర్ సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీ స్వాతి ఉన్నారు.

మల్లన్న క్షేత్రం.. బండారుమయం



కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం సోమవారం అగ్నిగుండాలు, పెద్దపట్నంతో మార్మోగింది. తోటబావి ప్రాంగణంలో శివసత్తులు బండారు (పసుపు) చల్లుకోవడంతో మొత్తం పసుపుమయం అయ్యింది. ఈ మహా ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. హైదరాబాద్ యాదవ సంఘం ఒగ్గుపూజారులు పంచవర్ణాలతో పెద్దపట్నం వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)


శంఖం పూరిస్తున్న భక్తురాలు


పసుపు బండారిని చల్లుకుంటున్న శివసత్తులు


అగ్నిగుండాలను తొక్కుతున్న భక్తులు, శివసత్తులు


మల్లికార్జునస్వామిని మొక్కుతున్న భక్తులు


పెద్దపట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు


భక్తురాలికి ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది


భక్తిపారవశ్యంలో శివసత్తుల నృత్యాలు


మల్లన్నస్వామి కథను భక్తులకు వివరిస్తున్న ఒగ్గు కళాకారులు


పసుపు బండారితో సాధువు పూనకం

ఆ చిన్నారులను చదివిస్తాం

- మహిళా సంక్షేమ బాలల సంరక్షణ అధికారులు
- 'చిన్నారులకు దిక్కెవరు'? కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

జోగిపేట(అందోల్): సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'చిన్నారులకు దిక్కెవరు? కథనానికి జిల్లా మహిళా సంక్షేమ బాలల సంరక్షణ అధికారులు స్పందించారు. సోమవారం జిల్లా మహిళా సంక్షేమ బాలల సంరక్షణ అధికారి విఠల్ జోగిపేటలోని రజక కాలనీలో నివాసం ఉంటున్న చిన్నారుల నాన్నమ్మ రాజమణి ఇంటికి వెళ్లి శ్రీనిధి, శ్రీతేజలను చదివించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. మీరు అనుమతిస్తే వారిని తీసుకువెళ్లి సంగారెడ్డిలోని బాలసదనంలో చదివిస్తామని, ఆరవ తరగతి కేజీబీవీలో చేర్పించి ఉన్నత చదువులు చెప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమాలు పూర్తయిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని బాలికల బంధువులు సూచించినట్లు అధికారి విఠల్ తెలిపారు.


బాలికల కుటుంబీకులతో మాట్లాడుతున్న విఠల్

కారు, బైక్ ఢీ

తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి

అల్లాదుర్గం(మెదక్): కారు, బైక్ ఢీకొని తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిల్వెర గ్రామానికి చెందిన గాండ్ల విఠల్ బైక్‌పై గడిపెద్దాపూర్ నుంచి జోగిపేట వైపు వెళ్తున్నాడు. గడిపెద్దాపూర్ గ్రామ శివారులో కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో విఠల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి సంగారెడ్డికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

యువకుడు మృతి

గజ్వేల్‌రూరల్: చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కోట మైసమ్మ దేవాలయం సమీపంలో నివాసముండే ఫకీర్‌పాష కొడుకు సోహెల్(23) ఆదివారం రాత్రి సమీప బంధువుల ఇంట్లో జరిగే శుభ కార్యానికి వెళ్లాడు. అక్కడే బంధువుల ఇంటి వద్ద సోహెల్ మద్యం సేవించి రావడంతో తండ్రి ఫకీర్ పాష మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సోహెల్ అక్కడి నుంచి పాండవుల చెరువు వైపు వెళ్లాడు. వెనుకే వచ్చిన ఫకీర్ పాషకు సోహెల్ జాడ కనిపించలేదు. కొద్దిసేపటికి చెరువుగట్టు వద్ద చెప్పులు గుర్తించి స్థానికుల సాయంతో చెరువులో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం గజఈతగాళ్ల సాయంతో మరోసారి గాలింపు చేపట్టగా సోహెల్ మృతదేహం లభ్యమైంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వలసొచ్చి.. వరి నాట్లు వేసి

జిల్లాలో వరి నాట్లు వేయడానికి రైతులను కొత్త సమస్యలు వేధిస్తున్నాయి. మొత్తం 48 లక్షల ఎకరాల్లో నాట్లు సిద్ధం కావడం వల్ల కూలీల కొరత ఏర్పడింది. ఇప్పటికే సగం వరినాట్లు పూర్తి అయినా మరో 50 శాతం ఉండడంతో ఎకరానికి రోజుకు 8 నుంచి 10 మంది కూలీలు అవసరం పడుతున్నారు. కానీ, నాటు వేయడానికి కూలీలు దొరక్క బిహార్, యూపీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన పురుష కూలీలతో రైతులు నాట్లు వేయిస్తున్నారు. ఎకరానికి రూ.5,500 వరకు గంపగుత్తగా మాట్లాడుకొని నాట్లు వేస్తున్నారు.

– దుబ్బాకటౌన్



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు కూలి పేరు సిద్దార్థ్. సొంత రాష్ట్రం పశ్చిమ బెంగాల్‌లో పెద్దగా చేసేందుకు ఉపాధి లేకపోవడంతో 30 రోజుల క్రితం ఆయనతోపాటు మరో 13 మంది కూలీలు వరినాట్లు వేసేందుకు సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతానికి వచ్చారు. ఇందులో ఒక వ్యక్తి వంటలు చేస్తుండగా మిగతా 12 మంది నాట్లు వేస్తారు. ప్రతి రోజూ 5 ఎకరాలకు పైగా నాట్లు వేస్తామని సిదార్థ్ చెప్పకొచ్చాడు. గతేడాది ఏపీలో వేశామని, ఈసారి ఆంధ్రాకు చెందిన వ్యక్తి తెలపడంతో ఇక్కడికి వచ్చామని ఇప్పటి వరకు కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో 130 ఎకరాల వరకు నాట్లు వేశామని చెప్పకొచ్చాడు.

- బెంగాల్, యూపీ, బిహార్ రాష్ట్రాల కూలీల జోరు
- జిల్లాలో వేధిస్తున్న కూలీల కొరత
- 12 మంది పురుషులు రోజుకు 5 ఎకరాలకు పైగా నాటు
- ఎకరాకు గంపగుత్తగా రూ.5,500
- మొత్తం 3.48 లక్షల ఎకరాల్లో నాట్లు అంచనా..
- ఇప్పటికే 50 శాతం పూర్తి


వరి నాట్లు వేస్తున్న పశ్చిమ బెంగాల్ కూలీలు

బెంగాల్‌కు చెందిన 13 మంది కూలీలు వరినాట్లు వేసేందుకు ఇక్కడికి వచ్చారు. రైతుల పొలాల్లో నారు తీసి వారే వేసుకొని రోజు 5 ఎకరాలకు పైగా నాట్లు వేస్తున్నారు. పొలాల్లో సన్నటి తాడుతో మునుములు కట్టుకొని చూస్తుండగానే టకటకా నాట్లు వేస్తున్నారు. ఎకరం నాటుకు వీరిని తీసుకొచ్చిన మధ్య వ్యక్తి రైతుల నుంచి రూ.5,500 తీసుకుంటున్నాడు. ఇందులో నుంచి బెంగాల్ కూలీలకు రూ.3,500 ఇస్తూ మిగతా డబ్బులతో వీరు ఉండడానికి వసతి, భోజనాలు, వాహనం తదితర సౌకర్యాలు చూసుకుంటున్నాడు. సాధారణంగా ఇక్కడ మహిళలు ఎకరం నాటుకు రూ.6 వేల వరకు తీసుకుంటుండగా, నారు వేసేందుకు మరో రూ.2,000 పైగా రైతులకు ఖర్చు అవుతుంది. దీంతో ఎకరం నాటుకు రైతుకు రూ. 8 వేలు ఖర్చు అవుతుంది. అదే బెంగాల్ కూలీలతో నాటు వేయిస్తే రూ.5,500 మాత్రమే అవుతుంది. ఎకరానికి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు రైతులకు ఆదా అవడంతోపాటు కూలీల బాధ తప్పుతుంది.

1.80 లక్షల ఎకరాల్లో పూర్తి..

జిల్లాలో ఈ యాసంగిలో 3.49 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేస్తారని వ్యవసాయాధికారుల అంచనా ఉంది. ఇప్పటి వరకు 1.80 లక్షల ఎకరాల్లో నాట్లు వేయడం పూర్తి అయ్యింది. ప్రస్తుతం జోరుగా వరి నాట్లు పడుతుండడంతో ఈ నెలలోపు నాట్లు పూర్తి అయ్యే అవకాశం ఉంది.

ఈసారి నాట్లు పెరిగే అవకాశం..



జిల్లాలో ఇప్పటికే సగంకు పైగా వరినాట్లు పూర్తి అయ్యాయి. ఈ యాసంగిలో 3.48 లక్షల ఎకరాల్లో వరి నాట్లు అంచనా ఉండగా ప్రస్తుతం 1.80 లక్షల ఎకరాల వరకు నాట్లు పడ్డాయి. కూలీల కొరతతో రైతులు వెద పద్ధతిలో వేసుకున్నారు. ఇతర రాష్ట్రాల కూలీలు, నాట్లేసే యంత్రాలు రావడంతో రైతులకు చాలా బాధలు తప్పాయి. ఈ సారి రికార్డు స్థాయిలో వరినాట్లు వేసే అవకాశం ఉంది.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

కొండపోచమ్మా.. దీవించమ్మా

- ఘనంగా జాతర ప్రారంభం
- తరలివచ్చిన వేలాది భక్తులు
- కొమురవెల్లి నుంచి నేరుగా కొండపోచమ్మకు..
- ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ రమేశ్


అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు


కొండపోచమ్మకు తరలివస్తున్న భక్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో గల కొండపోచమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో నిండిపోయింది.

కోటొక్క మొక్కులు..

కొండపోచమ్మకు వచ్చే భక్తులు కొత్త కుండల్లో నైవేద్యం వండి బోనాన్ని తయారు చేశారు. అనంతరం మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ అమ్మవారికి సమర్పించారు. అలాగే తల్లి పోచమ్మకి వడిబియ్యం పోయడానికి భక్తులు పోటీ పడ్డారు. యువతుల ఆటపాటలు, పోతరాజుల నృత్యాలతో ఆలయం ప్రాంగణం జనసంద్రంగా మారింది. పోలీసులు దగ్గరుండి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. గజ్వేల్ ఏసీపీ రమేశ్ ట్రాఫిక్ పరిశీలించారు.

కొమురవెల్లి టు కొండపోచమ్మ..

భక్తులు కొమురవెల్లి నుంచి భారీ వాహనాలతో కొండపోచమ్మకు బయలు దేరారు. మధ్యాహ్నం నుంచి బారులు తీరడంతో రహదారి అంతా వాహనాలతో కిక్కిరిసిపోయింది. మల్లన్న ఆలయం వద్ద పెద్దపట్నం, అగ్ని గుండాలను పూర్తి చేసుకుని భక్తులు వాహనాల్లో సాయంత్రం కొండపోచమ్మకు తరలివచ్చారు. ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎక్కడ ట్రాఫిక్ జామ్ కాకుండా చెక్ పోస్టుల ద్వారా చర్యలు తీసుకున్నారు.


యువతుల నృత్యాలు


పోతరాజుల నృత్యాలు

యాదవ్ సంఘం ఆధ్వర్యంలో..

హైదరాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడు సాయి యాదవ్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఏసీపీ రమేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత రమేశ్, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, సుధాకర్, చిన్నా, హరి, చందు తదితరులు పాల్గొన్నారు.

పండుగకు ఊరికి వెళ్లగా..

రెండు ఇళ్లల్లో చోరీ


చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రెండు ఇళ్లలో చోరీ జరిగిన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సైబర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సైబర్ కాలనీలో నివాసముండే కృష్ణ చౌహాన్ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఊరు సంగారెడ్డి వెళ్లాడు. సోమవారం ఉదయం కృష్ణ చౌవాన్ ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని చుట్టుపక్కల వాళ్లు గమనించి సమాచారం అందించారు. వెంటనే అతడు వచ్చి చూడగా రూ. మూడు వేల నగదుతోపాటు సీసీ కెమెరాలు చోరీ అయినట్లు గుర్తించాడు. అదే కాలనీ చెందిన సూరయ్య సైతం సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఏపీలోని విజయవాడకి వెళ్లారు. అతని ఇంటి తాళం సైతం గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి ఇంట్లోనే రూ.4 వేల నగదు, వెండి పాత్ర, దేవుడి విగ్రహం చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.